# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

DECEMBER - 2016

సంవత్సర చందా రూ. 50/-

# టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

## సత్యవాణి

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త |
| బుధవారం సాయంత్రం | : | 6.30 గంటలకు రక్షణ |
| గురువారం మధ్యాహ్నం | : | 2.30 గంటలకు రక్షణ |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | రిక్కీ గూటం |
| | | రోనీ గూటం |

**Youtube లో satyavanichurchofchrist.com**

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి

**SATYA VANI**

**P.O.BOX. 80, KAKINADA**

**PIN : 533004. Ph : 0884 - 2363722**

**98489 98547, www.satyavanicoc.com**

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

సంపుటి - 37 డిశంబరు - 2016 సంచిక -5


## నీవు క్రీస్తు సంఘ సభ్యుడవా ?

### (Are you a member of the Church of Christ ?)

యేసుక్రీస్తు సువార్తను విని, విశ్వసించి ప్రజలు దానికి ఎక్కడ లోబడుదురో అక్కడ వారు క్రీస్తుసంఘ సభ్యులై యున్నారు. వారు దేనిని బట్టి క్రైస్తవులయిరో దానిని బట్టియే క్రీస్తు సంఘ సభ్యులై యున్నారు. క్రీస్తు సంఘము పెంతెకోస్తు దినమున స్థాపించబడిన నాటి నుండి నేటి వరకును, రక్షింపబడుచున్న ప్రతివారిని ప్రభువు తన సంఘముతో చేర్చుచున్నారు (అపొ.కా. 2:47). సంఘమను శరీరమునకు క్రీస్తే శిరస్సు (కొలస్స 1:18). నీకు సంఘమను క్రీస్తు శరీరముతో సంబంధము లేని యెడల క్రీస్తుతో నీకు సంబంధము లేదని యర్థము. ఏలయనగా క్రీస్తే సంఘమునకు శిరస్సైయున్నారు.

యేసుక్రీస్తు పునరుత్థానుడై లేచిన తరువాత యిచ్చిన గొప్ప ఆజ్ఞలోని షరతులకు లోబడుట ద్వారా ప్రజలు క్రీస్తు సంఘ సభ్యులు కాగలరు. అయితే ఒకడు తన పాపముల నుండి రక్షింపబడవలెనన్న కూడ అదే షరతులకు లోబడవలసి యున్నది. యేసుక్రీస్తు యిచ్చిన ఆ గొప్ప ఆజ్ఞను మార్కు యిట్లు వ్రాసెను : “మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందిన వాడు

రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:15,16). రక్షింపబడిన ప్రతివానిని ప్రభువు తన సంఘముతో చేర్చును. నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షింపబడును గనుక ఒకడు నమ్మి బాప్తిస్మము పొందగానే అతడు సార్వజనిక క్రీస్తు సంఘము లోను, స్థానిక క్రీస్తు సంఘములోను సభ్యుడగును.

అందువలన యేసుక్రీస్తు యిచ్చిన గొప్ప ఆజ్ఞలో సమస్త జనులకు క్రీస్తును గూర్చి బోధించి వారికి బాప్తిస్మమియ్యవలెనని, అటు తరువాత క్రైస్తవ జీవితమును, ఆయన ఆజ్ఞాపించిన సంగతులన్నియును వారికి బోధించబడవలెనని క్రీస్తు చెప్పెను. మత్తయి ఇట్లు వ్రాసెను : "యేసు వారియొద్దకు (అనగా అపొస్తులుల యొద్దకు) వచ్చి, పరలోకమందును భూమి మీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది. కాబట్టి మీరువెళ్ళి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు కూమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదా కాలము మీతో కూడ ఉన్నానని వారితో చెప్పెను" (మత్తయి 28:18-20).

సువార్తయొక్క గొప్ప సత్యమును సీమోను పేతురు "నీవు సజీవుడవైన దేవుని కుమారుడవైన క్రీస్తువు" అని యేసునిగూర్చి ఒప్పుకొనెను (మత్తయి 16:16). పేతురు పలికిన ఈ గొప్ప సత్యము క్రైస్తవ్యమునకు, తన సంఘమునకు మూలరాయి యని యేసు గుర్తించి, "ఈ బండమీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువ నేరవని" చెప్పెను (16:18). సంఘము బండయైన క్రీస్తుపై కట్టబడినది. అది క్రీస్తుచే కట్టబడినది. అది పరిశోధించ బడిన అమూల్యమైన రాయి పై కట్టబడినది (యెషయా 28:16). గనుక ఎటుచూచినను క్రీస్తు లేకుండ సంఘము నిలబడుటగాని, క్రీస్తు సంఘములో లేకుండ క్రీస్తులో యుండుట గాని అసాధ్యమని మనము గ్రహించవలెను. సంఘము ఇప్పటికి, ఎల్లప్పటికి కూడ క్రీస్తు అను బండపై నిర్మించబడి యున్నది.

సువార్తకు విధేయులైనవారు క్రీస్తు అను బండపై నిర్మింతురు. యేసు

యిట్లనెను : "కాబట్టి యీ నా మాటలు విని వాటి చొప్పున చేయు ప్రతివాడును బండమీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిమంతుని పోలియుండును. వాన కురిసెను, వరదలు వచ్చెను, గాలి విసిరి ఆ యింటిమీద కొట్టెను గాని దాని పునాది బండమీద వేయబడెను గనుక అది పడలేదు" (మత్తయి 7:24,25). సంఘము క్రీస్తు అను బండపై నిర్మించబడియున్నది. ప్రభువు చెప్పిన మాటలను విని వాటి చొప్పున చేయు ప్రతివాడు ఆ బండమీద నిర్మించు వాడగును, రక్షింపబడును. ప్రభువు మాటలచొప్పున చేయని ప్రతివాడు నాశనమగును.

క్రీస్తు సంఘము సీయోనని పాత నిబంధనలో పిలువబడినది. "నా నీతిని దగ్గరకు రప్పించి యున్నాను. అది దూరమునలేదు, నా రక్షణ ఆలస్యము చేయలేదు. సీయోనులో రక్షణ నుండ నియమించుచున్నాను" అని యెషయా 46:13లో ప్రవచింప బడినది. "ఇప్పుడైతే సీయోనను కొండకును జీవముగల దేవుని పట్టణమునకు అనగా పరలోకపు యెరూషలేమునకును వేవేల కొలది దేవదూతల యొద్దకును, పరలోక మందు వ్రాయబడియున్న జ్యేష్ఠుల సంఘమునకును, వారి మహోత్సవ మునకును అందరి న్యాయాధిపతియైన దేవుని యొద్దకును... మీరు వచ్చి యున్నారు" అని హెబ్రీ 12:22,23లో వ్రాయబడి యున్నది. దేవుడు సీయోనులో రక్షణ నుండనిచ్చెను. ఆ సీయోను ఇప్పుడు జ్యేష్ఠుల సంఘమై యున్నది. గనుక రక్షణ సంఘములో యున్నది. ఆ సంఘము ఒక మానవ కల్పిత సంస్థ కాదుగాని క్రీస్తను బండమీద నిర్మితమైన ఆత్మీయ సంస్థయై యున్నది.

క్రొత్త నిబంధన సంఘము క్రీస్తు యొక్క శరీరమై యున్నది. "మరియు సమస్తమును ఆయన పాదముల క్రింద ఉంచి, సమస్తముపైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము; సమస్తమును పూర్తిగా నింపుచున్న వాని సంపూర్ణతయై యున్నది (ఎఫెసీ 1:22,23) అని అపొ.పౌలు వ్రాసెను. మరల, "సంఘమను శరీరమునకు ఆయనే శిరస్సు; ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యత కలుగు నిమిత్తము ఆయన ఆదియై యుండి మృతులలో నుండి లేచుటలో ఆదిసంభూతుడాయెను" అని కొలస్స 1:18లో వ్రాయబడి యున్నది.

సంఘము అనేక అవయవములు కలిగిన మానవ శరీరమువలె యున్నది. ఆ అవయవములలో ఏదైనను జీవము కలిగి యుండవలె నంటే అది శిరస్సుతో కూడిన శరీరమును అంటు పెట్టుకొని యుండవలెను. శరీరము నుండి ఒక కాలునుగాని, చేతినిగాని వేరుచేసిన యెడల ఆయవయవము నశించు పోవును. సంఘము క్రీస్తు శరీరమై యున్నది. శరీరము నుండి వేరైన వాడెవడైనను ఉన్న యెడల అతడు క్రీస్తునుండి వేరుపడినవాడు. రక్షణ క్రీస్తులో యున్నది. అయితే అట్లు వేరు పడినవాడు క్రీస్తులో లేకుండపోవును. అనేకులమైన మనము క్రీస్తు యొక్క శరీరముగా ఉండి, ఒకని కొకరము ప్రత్యేకముగా అవయవములై యున్నాము అని రోమా 12:5లో అపొ. పౌలు చెప్పుచున్నాడు. రక్షింపబడిన ప్రతివారు క్రీస్తు సంఘములో అవయవములై యున్నారు. రక్షింపబడినవారే క్రీస్తు సంఘమై యున్నారు అని మనము గమనించవలెను.

పాపియైన ప్రతిమానవుడు దేవునితో సమాధాన పడవలసియున్నది మానవుడు పాపము నుండి విడుదల పొందినపుడే ఆ సమాధానము నెలకొల్పబడగలదు. ఈ సమాధానమును ఆయన మనకు క్రీస్తు సంఘములో యిచ్చుచున్నారు. ఒకానొకప్పుడు పరజనులు, దేవుడు లేనివారు, నిరీక్షణలేని వారనబడిన వారిని ఆయన యిప్పుడు క్రీస్తుయేసు నందు క్రీస్తు రక్తమువలన సమీపస్థులనుగా చేసి క్రీస్తు ద్వారా యూదులను అన్యజనులను ఏకశరీరముగా చేసి దేవునితో సమాధానమును నెలకొల్పెను. ఆ ఒక్క శరీరమే క్రీస్తు సంఘము (ఎఫెసీ 2:12-16).

క్రీస్తు సంఘము యొక్క ప్రాముఖ్యతను లేఖనముల నుండి మరికొంత తరువాత సంచికలో నేర్చుకొందుము. నీవు రక్షింపబడ వలెనంటే క్రీస్తు సంఘస్థుడవు అగుట ముఖ్యము. క్రీస్తు సంఘములో చేర్చబడవలెనంటే నీవు ఒక మానవుని కాదుగాని, ప్రభువనే సమీపించవలెను. క్రీస్తును నమ్ముకొనుము, మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందుము. ప్రభువే నిన్ను తన సంఘముతో చేర్చుకొనును.

నీవు క్రీస్తు సంఘమందు కాక మానవ కల్పిత సంఘ సభ్యుడవైన యెడల నీ ఆత్మ ప్రమాదమునకు గురియగునని నీవు గ్రహించ గోర్తాను.

# యేసుక్రీస్తు జననము

## ( The Birth of Jesus Christ )

పరిచయము :-

1. బైబిలు సాధారణ చరిత్ర కూడ యేసుక్రీస్తు జననమును గూర్చిన సమాచారము మనకు తెలియ జేయును.

2. యేసుక్రీస్తు చారిత్రాత్మక పురుషుడు గనుక మనము చరిత్ర నుండి కొంత సమాచారము సేకరించవచ్చును.

**a)** ఆయన నిజముగా యున్న మానవుడు (దేవుడు కూడాను)

**b)** ఆయన ఒక ప్రదేశములో వాస్తవముగా జీవించెను.

**c)** ఆయన ఒక కాలములో, గుర్తించదగిన సమయములో, ఖచ్చితముగా జీవించారు.

**d)** యేసుక్రీస్తు అప్పుడు ఇప్పుడు మనుష్యుల జీవితములను ప్రభావితము చేయుచున్నారు.

3. బైబిలును, సాధారణ చరిత్రయును కూడ యేసుక్రీస్తు జననమును గూర్చి చాల పరిమితమైన సమాచారమునే అందించుచున్నవి.

**a)** క్రైస్తవునికైతే యేసుక్రీస్తును గూర్చి బైబిలు చెప్పునది నిస్సందేహమైనది.

**b)** అయితే సామాన్య చరిత్ర విషయంలో వాస్తవికతను, అవాస్తవికత ను వేరుచేయాలి. మరియు దృఢ పరచబడని పారంపర్యమును కూడ మనము వేరుచేయగలగాలి.

**I. యేసుప్రభువు జననము అసాధరణ మైనది. ఆయన ఒక కన్యకు జన్మించెను (యెషయా 7:14)**

**a)** క్రీస్తు కన్యకు జన్మించెనని, పాత నిబంధన ప్రవచనములు నెరవేరెనని సువార్తల లేఖకులు నిర్ధారించు చున్నారు.

1. మత్తయి 1:18-25 యోసేపుకు దేవుని దూత ప్రతక్షమై యెషయా 7:14లో ప్రవచింపబడినట్లు తనకు ప్రధానము చేయబడిన కన్య మరియు గర్భము ద్వారా నెరవేర్చబడబోవు చున్నట్లు తెలిపెను.

2. లూకా 1:26-28 కన్యయైన మరియకు దేవుని దూత ప్రత్యక్షమై తన గర్భము ద్వారా యెషయా 7:14 నెరవేర్చబడబోవుచున్నట్లు తెలిపెను.

**b).** యేసుక్రీస్తు జననము అద్భుతము, అద్భుతముల కంటె మహాద్భుతము.

1. అద్భుతమనగా దేవునిచే జరిగింపబడిన ప్రకృతికతీతమై వివేచింపదగిన ఒక సంఘటన.

2. యేసుక్రీస్తు కన్యగర్భమున ఉద్భవించడం మిగతావారి జనన విశేషములకు మించిన అద్భుతము (ఉదా: ఇస్సాకు, బాప్తీస్మమిచ్చు యోహానుల జననము ఆదికా. 12: 15; 17;21: 1-7 లూకా 1:5-25, 26)

**C) యేసుక్రీస్తు కన్యక గర్భమున పుట్టుట క్రైస్తవ్యము యొక్క ముఖ్య మూలసూత్రమైయున్నది.**

1. యేసుక్రీస్తు కన్యక గర్భమున జన్మించుట ఆయన దైవత్వమును గూర్చినట్టిది.

2. దేవుడు మానవుల మధ్య నివసించుటకు ఈ భూమిపై వచ్చుటకు కన్యక గర్భమును ఒక సాధనముగా ఉపయోగించెను (యోహాను1:1-3,14; 1తిమోతి 3:16; హెబ్రీ 2:16-17; ఫిలిప్పీ 2:6-8).

**D) యేసుక్రీస్తు కన్యకకు జన్మించినందు వలన పాపములో పడిపోయిన మానవులను విమోచించుట సాధ్యమాయెను.**

1. మానవుల విమోచన చిరకాలము నుండి ప్రవచనముల అంశమై యుండెను (ఆదికా.3:15; 49:10; యెషయా 7:14)

2. మానవులను పాపము నుండి రక్షించుటే యేసుక్రీస్తు రాకడ యొక్క ముఖ్యఉద్దేశ్యము (మత్తయి 1:21; లూకా 19:10).

3. యేసుక్రీస్తు ఈ లోకరక్షకుడై యున్నారు. ఈ ముఖ్యాంశమును బైబిలు నుండి తొలగిస్తే అది అర్థరహితమైన గ్రంధమగును.

4. కన్యకకు జన్మించుట వలన పాపములు నిజముగా క్షమించబడుటకు ఒక పరిపూర్ణబలిని సిద్ధపరచెను.

5. ఎవడైనా పాపముల నుండి రక్షించబడవలెనంటే యేసుక్రీస్తు ఒక్కరే ఏకైక రక్షణమార్గమై యున్నారు (అపో.కా. 4:12; రోమా 10:13; అపో.కా. 2:38).

**II. క్రైస్తవ్యము యొక్క శత్రువులు కన్యకకు జన్మించిన సంఘటను తక్కువ చేస్తారు, వ్యతిరేకిస్తారు :**

**A)** క్రీస్తు విరోధులైన నాస్తికులు దేవుడు లేడందురు. లౌకికవాదులు ప్రకృతికతీతమైన దేవుని కార్యములను కాదందురు.

1. క్రీస్తు విరోధులు బైబిలులోని ప్రతి అద్భుతము కల్పనా కధయని

చెప్పుదురు.

2. క్రైస్తవ్య విరోధులు కన్యక జననమిచ్చుటను, యేసుక్రీస్తు పునరుత్థానమును నిరాకరింతురు.

3. క్రైస్తవ్య విరోధులు బైబిలు ఒక పురాణమని చెప్పుదురు.

**B) లౌకికవాదులు నిర్ధేవులకంటే క్రైస్తవ్యమునకు ఎక్కువ సవాలుగా తయారయ్యారు.**

1. ఫ్రాన్సిస్ వోల్టైయిర్, తోమస్ పెమిన్ లాంటి నాస్తికులు క్రైస్తవ్య వ్యతిరేకులుగా పేరొందినవారు.

2, అయితే లౌకిక వాదులు క్రైస్తవుల మనే పరిగణింపబడుచు దానిని కించపరచుదురు.

3. ఈ లౌకికవాదులు బైబిలును పరోక్షముగా వ్యతిరేకించుట వలన ఎక్కువ ప్రమాదకారకులు. క్రైస్తవ్యమునకు మేము వ్యతిరేకులమని వారు బహిరంగముగా ఒప్పుకొనరు.

**C) కన్యక జననమిచ్చుట ప్రకృతి విరుద్ధము, అసంభవమని చెప్పుచు లౌకికవాదులు దానిని నిరాకరిస్తారు.**

క్రైస్తవులు కన్యక జనన మిచ్చుటతో సహా బైబిలులోని అన్ని అద్భుతములను విశ్వసిస్తారు ఏలయనగా దేవునికి అసాధ్యమైనదేదియు లేదు (లూకా1:37).

**D) యోహాను సువార్త యేసు యొక్క దైవత్వాన్ని గూర్చి చెబుతున్న యేసు కన్యక గర్భమున బుట్టినట్లు యేమీ చెప్పుటలేదని లౌకిక వాదులు వాదిస్తారు.**

1. నిజానికి యేసు యొక్క నరావతారమును గూర్చి చెప్పు ప్రతి లేఖనము ఆయన కన్యక గర్భమున బుట్టినట్లు చెబుతాడి (యోహాను 1:1-3, 10, 14,15,18).

2. యేసు శరీరావతారమును దైవత్వమును అపొ. యోహాను కలిపి చెబుతాడు.

3. యోహాను 1:14 కన్యక జనన మిచ్చుట సమర్థించుచున్నది. అది మిగతా సువార్తల రికార్డుతో ఏకీభవించు చున్నది.

**E) క్రీస్తు గాని అపొస్తులులు గాని కన్యక జనన మిచ్చుటను గూర్చి ఎన్నడు బోధించలేదని లౌకిక వాదులు వాదిస్తారు.**

1. రోమా 1:3-4లో దైవత్వములోని ఒక వ్యక్తి మానవావతారియై వచ్చెనని చెప్పుచున్నది. అందులో కన్యక జననమిచ్చుట ఇమిడియున్నది.

2. అట్టే గలతీ 4:4 శరీరా వతారమును

గూర్చి చెప్పుచున్నది. దానిలో కన్యక జనన మిచ్చుట ఇమిడియున్నది.

**F) యోసేపు యేసు యొక్క తండ్రియని లౌకిక వాదులు చెప్పుదురు.**

1. యోసేపు యేసు యొక్క తండ్రియని మరియ చెప్పినది కదా యని వారడుగుదురు (లూకా 2:48).

2. మరియు యోసేపు యేసు యొక్క తండ్రియని యూదులు కూడ భావించారని వారు చెబుదురు (లూకా 2:41; మత్తయి 13:55; లూకా 3:23; 4:22).

3. యోసేపు యేసు యొక్క పెంపుడు తండ్రి, నిజమే గాని యేసు తన పరిచర్య ప్రారంభించి అద్భుతములు చేయుట మొదలిడు వరకు లోకము ఆయన దైవత్వాన్ని గుర్తించలేదు.

**G). ప్రఖ్యాతి గాంచిన పురుషుల జనన గాధలలో వలే యేసుయొక్క జనన సందర్భము కూడ కట్టుకథలతో కూడి యున్నదని లౌకిక వాదులు చెప్పుదురు.**

1. పురాణాల్లో యున్నవారి జనన గాధలవలె యేసు యొక్క జననము కూడ పుక్కిట పురాణమే యని వారందురు.

2. అయితే యేసు యొక్క జననము పాత నిబంధన ప్రవచనములతోను, క్రొత్త నిబంధనలో వాటి నెరవేర్పుతోను ధృఢ పరచబడుచున్నది. మరియు ఆయన జజననమును గూర్చిన యూదుల అక్షాంక్షతోను, క్రొత్త నిబంధన క్రైస్తవులాయనను అంగీకరించుటతోను ధృఢపరచబడుచున్నది.

3. కన్యక జననమిచ్చుటను గూర్చి క్రైస్తవులు క్రొత్త నిబంధన ఆధారముల పై విశ్వసించుదురు.

4. ఆదిమ సంఘము యేసు కన్యకకు జన్మించినట్లు నమ్మలేదని ఆధునిక లౌకిక వాదులు చెప్పుటకు పూనుకొందురు.

**a)** బైబిలులో గాని, దానికి బయట గాని దీనిని ధృవీకరించుటకు ఆధారములు యేమీలేవు.

**b)** 18వ శతాబ్ధములో మాత్రమే కన్యక జననమిచ్చుటను శంకించు అబద్ధ బోధకులు బయలుదేరారు.

**III. యేసుయొక్క జననము చారిత్రాత్మకమైనది.**

**A) యేసు యొక్క జననమును బైబిలు ముందుగానే ప్రవచించినది.**

1. మెస్సీయ లేక రక్షకుడు కన్యక గర్భమున ఉద్భవించునని పాతనిబంధన ప్రవచించినది (ఆది 3:15; 12:3;

49:10; యెషయా 7:14).

2. రక్షకుడు జన్మించే స్థలము ముందు గానే ప్రవచింపబడినది (మీకా 5:2).

3. ప్రవచనము ద్వారా రక్షకుడు జన్మించే కాలము కూడ ప్రవచింప బడినది (దానియేలు 2:31-45).

**B) మెస్సీయ జననము గూర్చిన ప్రవచనములు నెరవేరినట్లు బైబిలు చరిత్ర ధృవీకరించుచున్నది.**

1. యేసు బెత్లేహేములో జన్మించెను (మత్తయి 2:1; లూకా 2:1-7).

2. యేసు కైసరు ఔగుస్తుపాలన కాలములో జన్మించెను. అప్పుడు కురేనియు సిరియదేశమునకు అధిపతిగాను రాజైన హేరోదు పాలస్తీనాను పాలించుచుండెను. (లూకా 2:1-2; మత్తయి 2:1).

**C) సామాన్య చరిత్ర కూడ యేసు యొక్క జననమును నిర్ధారించు చున్నది.**

1. యేసు జనన రికార్డు ఈ చరిత్ర గ్రంథములలో వ్రాయబడియున్నది :

I. Italy by John C.Abbott (Page 301)

II. A History of Rome by Artur E.R. Book (P.334)

III. World civilisations by Edward Burns and Pilip Ralph (360-363)

2. సామాన్య చరిత్ర క్రైస్తవ్యమునకు అనుకూలముగా యున్నది. అంతేగాకుండా క్రైస్తవ్య వ్యతిరేక చరిత్రకారులు కూడ నజరేయుడైన యేసు చారిత్రాత్మక పురుషుడని కూడ అంగీకరించారు.

**ముగింపు :**

1. నజరేయుడైన యేసనబడిన వ్యక్తి పాలస్తీనాలో జన్మించెననునది గొప్ప వాస్తవము :

ఎ. బైబిలు, సామాన్య చరిత్ర కూడ దీనిని ధృవీకరించు చున్నది.

బి. యేసు యొక్క జననము ప్రశ్నింప తగని వాస్తవము.

2. యేసు ఒక కన్యకు జన్మించెనునది గొప్ప వాస్తవము.

**ఆహ్వానము :** యేసుక్రీస్తు దేవుని కుమారుడు. కన్య మరియ గర్భము ద్వారా ఆయన ఈలోకమందు ఉద్భవించారు ఈలోకంలో జీవించారు, మరణించి సమాధి చేయబడి తిరిగిలేచారు. ఆయన సువార్త విని విశ్వసించి బాప్తిస్మము పొందిన వారిని ఆయన రక్షించును.

–లూయిస్ రష్మోర్

# నీ నామమును స్తుతించెదను

## (I will Praise Thy Name )

"యెహోవా నీవే నా దేవుడవు. నేను నిన్ను హెచ్చించెదను, నీ నామమును స్తుతించెదను. నీవు అద్భుతములు చేసితివి, సత్య స్వభావము ననుసరించి నీవు పూర్వకాలమున చేసిన నీ ఆలోచనలు నెరవేర్చితివి" (యెషయా 25:1).

యెహోవాకు స్తుతి కలుగును గాక! ఆయన ప్రభువులకు ప్రభువును రాజులకు రాజునైయున్నారు. "శ్రీమంతుడును అద్వితీయుడనగు సర్వాధిపతి యుక్తకాలముల యందు ఆ ప్రత్యక్షతను కనుబరచును. ఆ సర్వాధిపతి రాజులకు రాజును ప్రభువులకు ప్రభువునై యున్నారు" (1తిమో6:15). ప్రభువు నీదేవుడై యున్నారా? నీ జీవితమును ఆయన ఏలనిచ్చుచున్నావా? ఈ రోజే ఆయనకు సమర్పించుకొనుము. ఆయన నిన్ను ఆశీర్వదించును. ప్రభువు చేతులలో గాయములను, ప్రక్కలో గాయమును తాను చూచువరకు తోమా పునరుత్థానుడైన ప్రభువును గూర్చి నమ్మలేదు. అప్పుడతడు "నా దేవా, నా ప్రభువా!" అని బిగ్గరగా ఒప్పుకొన్నాడు (యోహాను 20:28).

మనము ప్రభువును ఘనపరచి స్తుతించుదాము. అనుదినము మనం పాడే స్తుతిగీతముల ద్వారా యిది జరుగును. హెబ్రీపత్రిక లేఖకుడిట్లు హెచ్చరించుచున్నాడు : "కాబట్టి ఆయన ద్వారా మనము దేవునికి ఎల్లప్పుడును స్తుతియాగము చేయుదము, అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు జిహ్వా ఫలము అర్పించుదము" (హెబ్రీ 13:15). పేతురు ఇట్లనుచున్నాడు : "అయితే మీరు చీకటిలో నుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మిమ్మును పిలిచినవాని గుణాతిశయములను ప్రచురము చేయు నిమిత్తము ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహమును, పరిశుద్ధజనమును దేవుని సొత్తయిన ప్రజలునైయున్నారు" (1పేతురు2:9). భక్తి, పరిశుద్ధ జీవితము ద్వారా ఆయనను ఘనపరచుము.సంఘముగా కూడి వచ్చినప్పుడాయనను

స్తుతించుము. ఆయన స్తుతినొంద దగినవాడు.

**ఆయన ఆశ్చర్య కార్యములు చేసినాడు.**

1. ఆయన భూమిని, మానవుని సృజించారు (ఆది.కా. 1)

2. ఆయన నోవహును అతని కుటుంబమును జలప్రళయము నుండి రక్షించారు.

3. ఆయన ఇశ్రాయేలీయులను బానిసత్వము నుండి రక్షించారు.

4. ఆయన ఇశ్రాయేలీయులకు కానాను దేశమునుగ్రహించారు.

5. ఆయన మన పాపముల నిమిత్తము తన కుమారుని బలియిచ్చారు (2 కొరింథీ 5:21).

6. ఆయన యేసును మృతులలో నుండి లేపారు (1 కొరింథీ 15:1–4).

7. ఆయన మనకు రక్షణ మార్గము ననుగ్రహించారు (యోహాను 14:6; మార్కు 16:16).

**ప్రభువు యొక్క ఆలోచనలు యదార్థము**

పరమందున్న దేవుడు యదార్థ వంతుడు. ఆయన నమ్మకమైన దేవుడు. ఆయన నమ్మదగిన వాడు. ఆయన శాసనములను, మాటలను మనము నమ్మవచ్చును. యేసు పరమందున్న తండ్రికి చేసిన ప్రార్థనలోని మాటలను గమనించుము. "సత్యమునందు వారిని ప్రతిష్ఠించుము; నీ వాక్యమే సత్యము" (యోహాను 17:17). మానవుని పాపము నుండి సత్యము వేరు చేయగలదు. "మీరు సత్యమును గ్రహించెదరు, అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును" (యోహాను 8:32). సత్యమునకు లోబడినప్పుడు ఆత్మశుద్ధిచేయబడును. "మీరు సత్యమునకు విధేయులవుట చేత మీ మనస్సులను పవిత్ర పరచుకొనిన వారైయుండి యొకని నొకడు హృదయ పూర్వకముగాను మిక్కుటముగాను ప్రేమించుడి" (1పేతురు 1:22). మన రక్షణకర్తయైన దేవుని ఎల్లప్పుడు స్తుతింతుము గాక!

–లోయ్ మిచ్చెల్

# మేము అలాంటి వారము కాము

## ( We are not like that )

2 కొరింధి 2,3,4,5 అధ్యాయముల ద్వారా దేవుని సేవకులు ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో, ఎలా బోధించాలో, ఎలా బోధించ కూడదో అనే విషయాలను తన పరిచర్య అనుభవాల ద్వారా అపొ. పౌలు వివరించాడు.

**మేముదేవుని వాక్యమును కలిపి చెరిపెడి వారము కాము :-**

(We are not Peddlers of God's World)

"మేము దేవుని వాక్యమును కలిపి చెరిపెడు అనేకులవలె ఉండక నిష్కాపట్యము గలవారమును దేవుని వలన నియమింపబడినవారమై యుండి క్రీస్తునందు దేవుని ఎదుట బోధించుచున్నాము" అని పౌలు గారు చెప్పుచున్నారు. (2 కొరింధీ 2:17).

ఏ పదార్థానికైనా మరొకటి కలిపినపుడు అది కల్తీ అయి ఆ పదార్థము పాడవుతుంది. దేవుని వాక్యాన్ని కూడా కల్తీ చేసే అబద్ధ బోధకులు ఉన్నారు. వారి వలె మనము దేవుని వాక్యాన్ని కలిపి చెరిపెడు వారిగా ఉండకూడదు.

మరి ఎలాగుండాలి? "దేవుని యెదుట యోగ్యుని గాను, సిగ్గు పడనక్కరలేని పనివానిగాను సత్యవాక్యమును సరిగా ఉపదేశించు వానిగాను నిన్ను నీవే దేవునికి కనపరచుకొనుటకు జాగ్రత్త పడుము". (2 తిమోతి 2:15).

"ఏలయనగా ఆయన శాస్త్రుల వలె గాక అధికారము గలవానివలె బోధించెను" (మత్తయి 7:29).

శాస్త్రుల బోధలో మతమున్నది. శాస్త్రుల బోధలో ధర్మశాస్త్రము ఉన్నది. వంశ పారంపర్యాచారములు ఉన్నవి. మానవ పద్ధతులు ఉన్నవి. వారు బోధించెదరు గాని ఆచరింపరు.

యేసుక్రీస్తు బోధలో శక్తి ఉన్నది. అధికారము ఉన్నది. కనుక సత్యవాక్యమును సరిగా బోధించే వారముగా దేవునికి కనుపరచుకోవాలి. దేవుని వాక్యమును కలిపి చెరిపెడి వారముగా ఉండకూడదు.

**మేముఅలాగు చేయక**

"తగ్గిపోవుచున్న మహిమ యొక్క అంతమును ఇశ్రాయేలీయులు తేరి చూడకుండునట్లు మోషే తన ముఖము మీద ముసుగు వేసుకొనెను. మేమట్లు చేయక ఇట్టి నిరీక్షణ గల వారమై బహు ధైర్యముగా మాట్లాడుచున్నాము (2 కొరింథీ 2:12, 13).

చాలామంది దేవుని వాక్యము మర్మమని, రహస్యమని అర్థం కాకుండా మాట్లాడుతారు. పెద్ద పదాలు లేక పెద్ద వ్యాకరణ వాక్యాలు వాడితే పెద్ద ప్రసంగీకులు కాదు. మన బోధలో స్పష్టత ఉండాలి.

"సహోదరులారా నేను మీ యొద్దకు వచ్చినపుడు వాక్చాతుర్యముతో గాని, జ్ఞానాతిశయముతో గాని దేవుని మర్మమును మీకు ప్రకటించుచూ వచ్చిన వాడనుకాను (1 కొరింథి 2:1).

'అరమరలేకుండా మీతో మాట్లాడుచున్నాను" (2కొరింథి 6:11). "ఈ మర్మమేదనగా అన్యజనులు సువార్త వలన క్రీస్తు యేసు నందు యూదులతోపాటు సమాన వారసులును ఒకే శరీరము నందలి అవయవములును వాగ్దానములో పాలివారునై యున్నారనునదియే" (ఎఫెసీ 3:6).

కావున బోధకులు అరమర లేకుండా సత్యవాక్యమును సరిగా విభజించి, సరిగా అర్థము చేసికొని బోధిస్తే వినే వారికి సరిగా అర్థమవుతుంది.

**మా అంతట మేముసమర్థులము కాము :-**

చాలామంది తాము బైబిలు పండితులమని వారికే అంతా బాగా తెలుసని అనుకొంటారు. కొందరైతే దేవుడు వారికి బయలు పరచాడు అని

అంటుంటారు. కాని అపొ. పౌలే ఈలాగు చెప్పుచున్నాడు :

"మా వలన ఏదైనా అయినట్లుగా ఆలోచించుటకు మా అంతట మేమే సమర్థులము కాము. మా సామర్థ్యము దేవుని వలననే కలిగి యున్నది. ఆయనే క్రొత్త నిబంధనకు అనగా అక్షరమునకు కాదు గాని ఆత్మకే పరిచారకులవుటకు సామర్థ్యము కలిగించి యున్నాడు. అక్షరము చంపుని గాని ఆత్మ జీవింప జేయును" (2 కొరింధి 2:5-6).

**మేముఅధైర్యపడము :**

అధైర్యపడే సమయాలు పరిణామాలు మన చుట్టూఉన్నప్పటికి అధైర్యపడకూడదు. కృంగిపోయే సమయాలు ఏర్పడినప్పటికి అధైర్యపడి దేవుని పని మానుకోకూడదు. ప్రతీ విషయములోను వెనుకంజవేయక ప్రార్థన పూర్వకముగా ధైర్యముతో ముందుకు సాగిపోవాలి.

"కాబట్టి ఈ పరిచర్య పొంది నందున కరుణింపబడిన వారమై అధైర్యపడము" (2కొరింధి 4:1).

"ఎటుబోయినను శ్రమపడు చున్నను ఇరికింపబడిన వారము కాము. అపాయములోనున్నను ఉపాయములేని వారముకాము. తరుమబడుచున్నను దిక్కులేని వారము కాము. పడద్రోయబడుచున్నను నశించు వారము కాము" (2కొరింధి 4:8,9)

"కావున మేము అధైర్యపడము. మా బాహ్యపురుషుడు కృషించు చున్నను ఆంతర్యపురుషుడు దినదినము నూతనపరచబడు చున్నాడు" (2 కొరింధి 4:16).

**కుయుక్తిగా నడుచుకొనక,వంచనగా బోధించక :-**

"అయితే కుయుక్తిగా నడుచు కొనకయు దేవుని వాక్యమును వంచనగా బోధింపకయు సత్యమును ప్రత్యక్షపరచుట వలన ప్రతి మనుష్యుల మనసాక్షి ఎదుట మమ్మును మేమే దేవుని సముఖమున మెప్పించుకొనుచు అవమానకరమైన రహస్యకార్యములను

విసర్జించుచున్నాము" (2 కొరింధి4:2).

సత్యవాక్యము బోధించుటలో కుయుక్తిగా నడచుకొనకూడదు. యుక్తి అనగా నేర్పు. అపొ.పౌలు యుక్తిగా ప్రజలను ప్రభువు మార్గములోనికి రక్షణ మార్గములోనికి నడిపించాడు. కుయుక్తి అనగా మాయోపాయము. కుయుక్తి అనేది సాతాను యొక్క లక్షణము. దేవుని వాక్యమును వంచనగా బోధించకూడదు. ఉన్నది ఉన్నట్లుగా బోధించాలి.

**వెలిచూపు వలనకాక - విశ్వాసముతో నడచుకొనుట :-**

(We walk by faith not by sight)

"వెలిచూపు వలన కాక విశ్వాసము వలననే నడచుకొను చున్నాము (2కొరింధి 5:6).

ఏదో లాభాన్ని అపేక్షించి పరిచర్యచేయుట కాదుగాని విశ్వాసముతో ప్రభువు పరిచర్యలో కొనసాగాలి.

కనుక బోధకులు దేవుని వాక్యము కలిపి చెరిపెడివారుగా ఉండక, అందరికి అర్ధమగురీతిలో అరమర లేకుండా బోధించాలి. మన సామర్థ్యము దేవుని వలననైనదని ఎరిగి బోధించాలి. దేవుని పరిచర్య చేయుటలో అధైర్య పడక ధైర్యముతో బోధించాలి. కుయుక్తితో నడుచుకొనక, వెలిచూపు వలనకాక విశ్వాసముతో దేవుని పరిచర్యను కొనసాగించాలి.

సత్యవాక్యము సరిగా ఉపదేశించువారిగా ఉండాలి.

- బి.యస్.ఎ.సువాం


సత్యవాక్కు సాలు చందా మీరు కట్టారా ? ఈ రోజే 50/ -రూ॥లు ఎమ్.ఒ. చేసి మీ సభ్యత్వము కొనసాగించండి.

**సత్యవాణి**

7-9-35, సాంబమూర్తి వీధి,

కాకినాడ - 533 001.

# క్రిస్మస్ పండుగ సంబరాలలో కల్పితములు

## క్రిస్మస్‌పండుగలో కల్పితములు

ఈనాడు ప్రపంచములో క్రైస్తవులు జరుపుకుంటున్న క్రిస్మస్ (క్రైస్ట్‌మాస్) పండుగలో అసత్యాలు ఉన్నాయని తెలిసినపుడు అది బైబిలుకు సంబంధించిన ఆజ్ఞ ఆచారము కాదని చెప్పినపుడు మీకు ఆశ్చర్యము కలుగవచ్చు. కాని ఇది వాస్తవము. ఈ క్రింది సత్యములను యదార్థ హృదయముతో శ్రద్ధగా పరిశోధించి చూడుము.

## బైబిలు గ్రంథము సత్యమైనది :

క్రైస్తవ విశ్వాసానికి, నిరీక్షణకు మనిషి ఈ భూమ్మీద పుట్టినది మొదలుకొని పరలోకము చేరేవరకు వానిని నడిపే దిక్సూచిలాంటిది ఈ బైబిలు. ఇది దేవుని మనస్సు, మనిషికి దేవుడిచ్చిన తూనిక, ఇందులోని దేవుని మాటలు పుటముచేబడినవి, "మీ దేవుడైన నేను మీకాజ్ఞాపించిన మాటలతో దేనిని కలుపకూడదు, దానిలో నుండి దేనిని తీసివేయకూడదు" (ద్వితీ. 4:2).

"నేను మీకాజ్ఞాపించుచున్న ప్రతి మాటను అనుసరించి చేయవలెను. దానిలో నీవు ఏమియు కలుపకూడదు, దానిలో నుండి ఏమియు తీసివేయకూడదు (ద్వితీ. 12:32).

"ఆయన మాటలతో ఏమియు చేర్చకు ఆయన నిన్ను గద్దించునేమో అప్పుడు నీవు అబద్ధికుడవగుదువు (సామె. 30:6).

## యేసు డిశంబరు 25వ తేదీన పుట్టలేదనుటకు ఆధారములు :

ప్రజాసంఖ్య : డిశంబరు నెలలో పాలస్తీనాదేశమందు విపరీతమైన చలి, నీరుగడ్డకట్టునంత చలికాలములో ప్రజా సంఖ్య వ్రాయుమని రోమాచక్రవర్తియైన కైసరు ఔగుస్తు ఆజ్ఞాపించి యుండకపోయి యుండవచ్చును. అది ఆయా ప్రాంతముల నుండి ప్రజలు ప్రయాణము చేయుటకు అనువైన వేసవికాలమై యుండవచ్చును కదా! ఆలోచించుము.

గొఱ్ఱెలకాపరులు : రాత్రివేళ మంటవేసి చలికాచుకొనుచున్నట్లు చెప్పుదురు కాని లేఖనములలో

అలాలేదు "ఆదేశములో కొందరు గొఱ్ఱల కాపురులు పొలములోవుండి రాత్రివేళ తనమమందను కాచుకొను చుండగా" (లూకా 2:8). డిశంబరు నెలలో మనుష్యులుగాని గొఱ్ఱెలుగాని పాలస్తీనా దేశపు పొలములో ఉండే అవకాశము లేదు. ఎందుకంటే ఎముకలు కొరుకునంత విపరీతమైన చలి. గనుక గొఱ్ఱెలకాపరులు పొలములో రాత్రివేళ తమమందను కాచుకొను కాలము డిశంబరునెల కాక వేసవికాలమై యుండవచ్చును కదా లోచించుము.

**డిశంబరు 25వ తేది :**

యేసు డిశంబరు 25వ తేదీన పుట్టినట్టు బైబిలులో కాని మొదట శతాబ్దపు చరిత్రలోగాని వ్రాయబడి నట్లు కనుగొనలేము. అయితే ఆ దినమును గూర్చి బైబిలు యిలా చెప్పుచున్నది. "దావీదుపట్టణ మందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టి యున్నాడు" (లూకా 2:6). బైబిలు లేఖనము తెలిపినది ఇదియే. నేడు అనే ఆ దినము డిశంబరు 25వ తేదీయని ఋజువుచేయుటకు ఏ ఆధారములు లేవు. 25 కాదని తెలుపుటకు చాలా ఆధారాలున్నాయి గమనించు : పాత నిబంధనలో ఏయే పండుగను ఏయే దినాన ఎలా ఆచరించాలో తెలిపిన దేవుడు యేసుపుట్టిన తేదీ ముఖ్యమైనదైతే ఆ తేదీని తెలిపి, ఆ పండుగను ఎలా ఆచరించాలో తెలిపియుండును కదా! లేక యేసు నన్ను జ్ఞాపకము చేసికొనుటకు ఈ తేదీని గుర్తుంచుకొనమని అపొస్తలుల కైనను జ్ఞాపకము చేసియుండును కదా! అపొస్తులులైనా, ఆదిక్రైస్తవులైన దీనిని ఆచరించియుండెడివారు కదా! ఆగి ఆలోచించు. అయితే యేసు తన పునరుత్థాన దినమును జ్ఞాపకము చేసికొనుటకు దీనిని (ప్రభురాత్రి భోజనము) చేయుమని చెప్పెను. (మత్తయి 26:26-28; లూకా 22:19-20; 1 కొరింధి 11:23-31 దయచేసిచూడము). చిత్రమేమిటంటే, దేవుడు ఏదిచేయమని చెప్పాడో అదిచేయక మనుష్యులు తమ సొంత జ్ఞానముతో కల్పించిన ఈ పారంపర్యాచారమైన క్రిస్మస్ పండుగను పాటించుటకు ప్రాముఖ్యత చూపుతున్న ఈ క్రైస్తవ లోకమును చూచినప్పుడు ఒకవైపు ఆశ్చర్యము మరోవైపు విచారము కలుగు చున్నది.

**క్రిస్మస్‌పండుగ పూర్వ చరిత్ర :**

క్రీస్తు పూర్వము వెనవ తోమీయులు, రోమీయులు సూర్యుని పూజించే సాటర్నేలియా అను పండుగను ఏడు రోజులు చేతురు. అది డిశంబరు 17న ఆరంభమై 25వ తేదీకి ముగియును. ఆ ఏడు రోజులు రోమీయులకు ప్రభుత్వ సెలవు దినములు. ఆ ఏడు దినములు వారు నీచాతినీచమైన పనులు చేయుదురు. ఆ దినములలో ఏ పాపము చేసినను ఎవరు అడుగరు. వారి సమాజములోని కొందరిని చంపుట ద్వారా చీకటి శక్తులను పారద్రోలుదుమను మూఢనమ్మకము వారికుండెడిదట.

క్రైస్తవ మతమును రోమన్ కేథలిక్కులు స్వాధీనము చేసికొనిన తరువాత అధికారము వారిచేతిలో ఉన్నందున వారు 4వ శతాబ్ధములో ఈ సాటర్నేలియా అను పండుగను రోమన్ కేథలిక్కులు చేయుటకు అంగీకరించినందునే, దీనిని క్రైస్తవ మతములోనికి ప్రవేశింపచేసి ఈ పండుగను క్రీస్తు పుట్టుక దినముగా డిశంబరు 25కు మార్చిరని చరిత్ర తెలుపుచున్నది. అది చలికాలము కాబట్టి త్రాగుట, నాట్యమాడుట, కేరల్స్ పాటలు పాడుట, కేరింతలు కొట్టు ఇలాంటి పాడు పనులు చేయుదురనియు ఆనాటి రోమీయులు యూదులను ఈ పండుగనాడు అవమానపరచి, హింసింతురనియు చరిత్ర తెలుపుచున్నది.

**రోమన్ కేథలిక్కుల–మాస్ ఈక్రిస్మస్ :**

కేథలిక్కులు దీనిని ఒక ప్రత్యేకమైన మాస్‌గా ఆచరించిరి. క్రైస్ట - మాస్ అనునదే క్రిస్మమస్‌గా పిలువబడినది. ఇది రోమన్ కేథలిక్కుల ద్వారా ప్రవేశపెట్ట బడిన పండుగ, దీనిని ఆచరించినట్లైతే రోమన్ కేథలిక్కులను సమర్ధించినట్లే కదా! దీనిని సమర్ధించినవారు కేథలిక్కులు ఆచరిస్తున్న అనేక ఆచారములను కూడ సమర్ధించవలసి యుండవలెను కదా!

**క్రిస్మస్ ట్రీ :**

యేసు పుట్టకకు క్రిస్మస్ చెట్టుకు ఏ విధమైన సంబంధము లేదు. ఇదియును మానవ కల్పితమే ఈ క్రిస్మస్ చెట్టును గూర్చిన పూర్వచరిత్రను క్లుప్తముగా గమనించుము :

క్రిస్మస్ చెట్టుగా వచ్చిని

కానిఫెరన్‌ను ఉపయోగించటం ఆనవాయితీగా వస్తోంది. 16వ శతాబ్ధంలో జర్మనీలోనూ 15వ శతాబ్ధంలో లివోనియా ప్రస్తుతం ఈస్తోనియా, లాత్వియాలో మొదట క్రిస్మస్ చెట్టును అలంకరించడం అనే సంప్రదాయం మొదలైందంటారు. క్రిస్మస్ రోజుల్లో ఈ చెట్టుని ఇంటికి తెచ్చి కొవ్వొత్తులు లేదా విద్యుద్దీపాలతో, రకరకాల వస్తువులతో అలంకరిస్తారు. క్రిస్మస్ చెట్టుని పరిశీలిస్తే ఈ సంప్రదాయం 1781లో బెన్స్విక్ సైనికుల ద్వారా కెనడాలోకి ప్రవేశించిందంటారు. జనరల్ ఫెడరిక్ అడాల్ఫ్ రెడి.ఇల్ అనే సైనికాధికారి ఇచ్చిన క్రిస్మస్ విందులో అతిథులను అబ్బురపరచటం కోసం ఫర్ చెట్టుని కొవ్వొత్తులతో, పండ్లతో అలంకరించాడట! 19వ శతాబ్ద ప్రారంభంలో ఈ సంప్రదాయం ప్రాచుర్యం పొందింది. ఆ తర్వాత రష్యాలాంటి దేశాల్లోనూ సంపన్న కుటుంబాలవారు క్రిస్మస్ చెట్టుని ఉపయోగించటం మొదలుపెట్టారు. 1816లో నస్సావో-విల్‌బర్గ్ యువరాణి హెన్‌రేటా క్రిస్మస్ చెట్టుని వియన్నా దేశానికి పరిచయం చేసింది. ఆతర్వాత కాలంలో ఈ సంప్రదాయం ఆస్ట్రియాకి విస్తరించింది. ఫ్రాన్స్ దేశంలోకి 1840లో డచ్ వారి ద్వారా ఈ చెట్టు వచ్చింది. బ్రిటన్ దేశంలోకి 19వ శతాబ్ధ ప్రారంభంలో క్రిస్మస్ సంప్రదాయంలో భాగమైంది. రాణి విక్టోరియా తనకు చిన్నప్పటి నుంచి ఈ చెట్టుతో అనుబంధం ఉన్నట్లు ఒక పత్రికలో పేర్కొన్నారు. ఆ తర్వాత కాలంలో ప్రపంచ వ్యాప్తంగ క్రిస్మస్ చెట్టు ప్రసిద్ధి చెందింది.

క్రిస్మస్ ట్రీతో అలంకరించుట ఒక విధమైన విగ్రహారాధన. ఇది అన్యజనుల ఆచారము ఇలాంటి ఆచారములను గూర్చి దేవుడు ముందుగానే యిర్మియా ద్వారా ఖండించెను.

"యెహోవా సెలవిచ్చున దేమనగా – అన్యజనముల ఆచారముల నభ్యసింపకుడి, ఆకాశమందు అగపడు చిహ్నములకు జనములు భయపడును, అయితే మీరు వాటికి భయపడకుడి. జనముల ఆచారములు వ్యర్థములు, అడవిలో నొకడు చెట్టు నరకునట్లు అది నరకబడును, అది పనివాడు గొడ్డలితో చేసిన పని. వెండి బంగారములచేత

పనివారు దానిని అలంకరింతురు, అది కదలక యుండునట్లు మేకులు పెట్టి సుత్తెలతో బిగగొట్టి దాని నిలుపుదురు." (యిర్మియా 10:2-4)

"ఒకడు దేవదారుచెట్లను నరుకవలెనని పూనుకొనును. శ్మశాన వృక్షములలో ఏదో ఒక దానిని తీసుకొనును. ఒకడు చెట్టు నాటగా వర్షము దాని పెంచును. ఒకడు పొయ్యి కట్టెలకు వాటి నుపయోగించును. వాటిలో కొంత తీసికొని చలి కాచుకొనును. నిప్పు రాజబెట్టి రొట్టె కాల్చుకొనును. ఒక తుండు తీసికొని దానితో ఒక దేవతను చేసికొనును, దానికి నమస్కారము చేయును. దానితో ఒక విగ్రహము చేసి దానికి సాగిలపడును. అగ్నితో సగము కాల్చి యున్నాడు. కొదువ సగముతో మాంసము వండి భక్షించియున్నాడు. తిని తృప్తిపొందగా చలి కాచుకొనుచు, ఆహా, చలి కాచుకొంటిని వెచ్చగా ఉన్నది అని అనుకొనుచున్నాడు. దానిలో మిగిలిన భాగముతో తన దేవతగానున్న విగ్రహమును చేయించుకొనును. దాని యెదుట సాగిలపడుచు నమస్కారము చేయును, - నీవే నా దేవుడవు నన్ను రక్షింపుమని ప్రార్థించును." (యెషయా 44:14-17). గనుక ఇది ఒకరకమైన విగ్రహారాధన.

ఈనాటి క్రైస్తవులు క్రొత్త నిబంధన చట్టమైన పత్రికలను ఆధారము చేసికొని జీవించాలి. అపొస్తులుల బోధయే ఈనాటి క్రైస్తవుల ఆత్మీయ జీవన ప్రమాణము. అపొస్తులులు చేయమని చెప్పినవి చేయాలి. చెప్పనవి మానాలి. మొదటి శతాబ్ధపు సంఘములే ఈనాడు మనకు మాదిరి. కాబట్టి మనుష్యులు కల్పించిన పద్ధతులను అనుసరిస్తారా ? లేక దేవుడు చేయుమని ఆజ్ఞాపించిన వాటినే అనుసరిస్తారో తీర్మానించు కొనుడి.

వి. రాజు, చెన్నై

ఈ మనుష్యులు పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది. మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు **(మత్తయి 15:6-9).**

## సంక్షిప్త వార్తలు

2016 నవంబరు 8, 9, 10 తేదీలలో కాకినాడ సత్యవాణి – క్రీస్తు సంఘ ఆవరణలో బైబిలు లెక్చరర్‌షిప్ ఘనముగా జరిగెను. ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రము వేళ ఈ కూటములు జరిగెను. నవంబరు 8వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభమైన కూటములో సోదరులు టి. జ్ఞాన సుధీర్ గారు గంభీర ఉపన్యాసము చేసిరి. తదుపరి లూయిస్ రష్‌మోర్ గారు తెర్మన్‌హాడ్జ్ గారు వాక్యపరిచర్య చేసిరి. మధ్యాహ్నకాలము సమీపించు సరికి లెక్చరర్‌షిప్ హాల్ అంతయు ప్రజలతో నిండిపోయెను.

మొదటిరోజు మధ్యాహ్నకాలములోను, సాయంకాల కూటములోను అమెరికా సోదరులిద్దరు వాక్యపరిచర్య చేసిరి. లూయిస్ రష్‌మోర్ గారు “రండి యేసును కలిసికొందము” అను శీర్షిక పై ఉపన్యసించిరి.

రెండవరోజు ఉదయం కూటములో ద్వారపూడిలో పరిచర్య చేయుచున్న సోదరులు తిమోతిపాల్ గారు అపొ.కా. 12వ అధ్యాయము నాధారము చేసికొని చక్కటి బైబిలు సందేశమునిచ్చిరి. తదుపరి జాన్‌డీన్ గారు వాక్యపరిచర్య చేసిరి. అటుతరువాత తెర్మన్ హాడ్జ్ గారు, లూయిస్ రష్‌మోర్ గారు వాక్యము నందించుచుండగా లెక్చరర్‌షిప్ హాల్ అంతయు క్రిక్కిరిసి పోయెను. కొందరు బయటప్రాంగణంలో యుండి వాక్యము వినిరి. ఆరోజు మధ్యాహ్నం, సాయంత్రం కూడా ఇద్దరు అమెరికా సోదరులే వాక్యోపదేశము గావించిరి.

మూడవ దినమున సోదరులు జాన్‌డీన్ గారు మరియొక్క గంభీర ఉపన్యాసము చేయగా, ఆయన తదనంతరము లూయిస్ గారు థెర్మన్ హాడ్జ్ గారు వర్తమానము నందించిరి. మూడవ దినము సాయంత్రము కూటముతో లెక్చరర్‌షిప్ అంతమాయెను. ఈ కూటములలో సోదరులు డి. నాని గారు, యస్. యేసురత్నం గారు, వి. సత్యానందం గారు పాటలలో సహకరించిరి. శ్రీకాకుళం నుండి వచ్చిన ఆర్.సి.హెచ్. సద్గుణరావ్ గారును, చీపురుపల్లిలో

పనిచేయుచున్న యమ్. సాల్మన్ రాజు గారును తర్జుమా చేయుటలో సహకరించిరి. పలుప్రాంతముల నుండి ఆంధ్ర, తెలంగాణా, ఒరిస్సా రాష్ట్రముల నుండి వచ్చినవారు పాటలలోను, ప్రార్థనలలోను సహకరించిరి. స్థానిక సంఘము వచ్చినవారందరికీ మంచి భోజన సదుపాయము కల్పించిరి. అన్ని విషయములలో దేవుని నామము ఘనపరచబడెను.

2016 నవంబరు 12వ తేదీన లూయిస్ రష్మోర్ గారు ఢిల్లీకును, రిక్కీ గూటం గారు దుబాయ్‌కును వాక్యపరిచర్య నిమిత్తమై వెళ్ళియుండిరి. ఫెర్మన్‌హాడ్జ్ గారు 13వ తేదీ ఆదివారం స్థానిక సంఘారాధనలో పాల్గొని వెంటనే అమెరికాకు బయలుదేరి సుఖముగా చేరుకొనిరి. 13వ తేదీ ఆదివారం రిక్కీ గూటం గారు దుబాయ్ తెలుగు ఆరాధనలోను, సాయంత్రం ఇంగ్లీషు ఆరాధనలోను వాక్యోపదేశము గావించిరి. 16వ తేదీ ఉదయానికి మరలా స్వదేశమునకు తిరిగి చేరుకొనిరి. ఆయా కూటములన్నిటికి హాజరైన సోదర సోదరీలందరికీ మా హృదయపూర్వక వందనములు.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2015-17
Date of Posting: 14 & 15th every month

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001



Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.